క్లుప్తంగా

ఎం.కొత్తవలసలో వైద్యశిబిరం



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: మండలంలోని ఎం.కొత్తవలస గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు సుష్మ ఆధ్వర్యంలో సోమవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 72 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.ఈ సందర్భంగా ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు నివాసప్రాంతాల మధ్య మురుగునీటి నిల్వలు, కొబ్బరి బొండాల చిప్పలు, టైర్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థిని ధనలక్ష్మి

గుర్ల: సౌత్‌జోన్ సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు గరికివలస హైస్కూల్ విద్యార్థిని మండల ధనలక్ష్మి ఎంపికైందని పాఠశాల పీడీ బి. మల్లికార్జునరావు సోమవారం తెలిపారు. జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనబరచడంతో సౌత్‌జోన్ పోటీలకు రాష్ట్ర జట్టులోకి ఎంపికైందని చెప్పారు. ఈనెల 16, 17వ తేదీల్లో తమిళనాడులోని కోయంబత్తూర్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననుంది.విద్యార్థినిని హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

సీసీరోడ్డు పనులకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ ,అధికారులు

బొండపల్లి: మండలంలోని కెరటాం గ్రామంలో పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులతో మూడుసీసీ రోడ్లు ,కాలువ పను లకు సర్పంచ్ నంబూరి రాజేష్, ఎంపీడీఓ జి.గిరిబాల సోమవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 21 లక్షల తో ఈ పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా త్వరగా పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీరాజ్ జేఈఈ పి.అప్పలనాయుడు, ఈఓపీఆర్డీ ఏ.రఘుపతిరావు, ఏపీఓ బి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

బొండపల్లి: మండలంలోని బిల్లలవలస గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీడీఓ జి.గిరిబాల సోమవారం ఆకస్మిక తనిఖీ లు చేశారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. కేంద్రం పరిధిలో గర్భిణులు, బాలింతల వివరాలపై అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తను ఆరా తీశారు. రికార్డులన్నీ పక్కాగా నిర్వహించాలని, బాలింతలు,గర్భిణులు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని చెప్పారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి



పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఎంపీడీఓ కల్యాణి

గజపతినగరం: గ్రామాల్లో పారిశుద్ధ్య, తాగునీరు, ఇతర సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని, అలాగే అర్హులకు పింఛన్ అందేలా చూడాలని ఎంపీడీఓ బి.కల్యాణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో వివిధ అంశాలపై సోమవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతి కార్యదర్శులు, గ్రామసచివాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. సకాలంలో విధులకు హాజరు కాక పోయినా, ప్రజలకు సేవలందించడంలో విఫలమైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలని, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. ఈఓపీఆర్డీ బి.సుగుణాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

డయేరియా విజృంభణ

- గుర్లలో ఒక్క రోజులోనే 30 కేసులు నమోదు..!
- కెల్ల, గోషాడ, కోటగండ్రేడులోనూ ఇదే పరిస్థితి
- పారిశుద్ధ్య లోపం, కలుషిత తాగునీరే కారణమంటున్న ప్రజలు




గుర్ల పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న డయేరియా రోగులు

గుర్ల: మండలంలో డయేరియా విజృంభిస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వారం రోజుల కిత్రం వరకు పెనుబర్తి గ్రామంలో మాత్రమే డయేరి యా కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం చుట్టు పక్క గ్రామా లతో పాటు మండలంలోని చాలా గ్రామాల్లో డయేరియా కేసులు బయటపడుతుండడం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా చంపావతి నదీ పరివాహక ప్రాంత గ్రామాల్లో డయేరియా విజృంభిస్తోంది. దీనికి కారణం తాగు నీరు కలుషితం కావడమే కారణమని తెలుస్తోంది. చంపావతి నది నుంచి సురక్షిత తాగునీటి పథకాల ద్వారా తాగునీరు సరఫరా అవుతున్న సొలిపిసోమరాజుపేట, కెల్ల, కోటగండ్రేడు, కలవచ ర్ల, గోషాడ, మణ్యపురిపేట, వల్లాపురం గ్రామాల్లో డయేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. తాగునీరు కలుషితం కావడంతో పాటు గ్రామాల్లో పారి శుద్ధ్యలోపం కూడా ఉందని ఆయా గ్రామప్రజలు చెబుతున్నారు. మండల కేంద్రం గుర్లలో సోమవారం ఒక్కరోజే దాదాపు 30 కేసులు నమోదుకాగా, ఇప్పటి వరకు మొత్తం 60 కేసులు నమోదైనట్లు సమాచారం. అయితే వైద్యాధికారులు వీటిని అధికారికంగా ధ్రువీకరించడం లేదు. వ్యాధి బారినపడిన వారిలో కొంద రు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో చికిత్స తీసుకుంటుండగా, మరికొంత మంది ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరారు.గుర్లలో మండల బీజేపీ నాయకుడు చింతపల్లి అప్పారావు ఆదివారం డయేరియాతో మృతి చెందాడని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులు

మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో కేవలం పది బెడ్లు మాత్రం అందుబాటులో ఉన్నాయి. డయేరియా బాధితులతో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చిన వారి సంఖ్య పెరిగిపోవడంతో బెడ్‌లు చాలడం లేదు. ఒక బెడ్‌పై ఇద్దరు రోగులకు చికిత్స అందించాల్సి వస్తోంది. రోగుల తాకిడి పెరగ డంతో కొంతమందికి ఖుర్చీలు, బెంచీలపై కూర్చోబెట్టి సెలైన్లు ఎక్కిస్తున్నారు. ఆస్పత్రిలో ఖాళీ లేకపోవడంతో మండల కేంద్రంలో కొంతమంది రోగుల ఇళ్లకే ఏఎన్ఎంలు వెళ్లి వైద్యం అందిస్తున్నారు.



గుర్లలో వీధి కాలువలో ఉన్న తాగునీటి కుళాయిల పైపులు



కుర్చీలపైనే సెలైన్ ఎక్కించుకుంటున్న రోగులు

అందరికీ వైద్యం అందిస్తున్నాం

డయేరియా బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ వైద్యం అందిస్తున్నాం. గ్రామాల్లో ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వ్యక్తి గత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వేడి ఆహార పదార్థాలనే తీసుకోవాలని సూచిస్తున్నాం. ఎవరికైనా వాంతులు, విరేచనాలు అయితే ఆలస్యం చేయ కుండా వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి వైద్యం చేయించుకోవాలి. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కకే కాచి వడబోసిన నీటినే తాగాలి.

– చెన్నయ్, గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి

ఘనంగా దుర్గమ్మ అనుపోత్సవం



ఎస్.కోటలో అమ్మవారి ఊరేగింపు

శృంగవరపుకోట: అలరించిన వేషాలు, వేలసంఖ్యలో భాజరైన భక్తులు, బాణసంచా, బాజా భజంత్రీలతో పట్టణంలో దుర్గమ్మ అనుపోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని దుర్గాదేవీ ఆలయంలో ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరిపారు. అమ్మవారిని రోజుకో అవతారంలో అలంకరించి కుంకుమ పూజలు, అర్చనలు అభిషేకాలు చేయడంతో పాటు సాయంత్రం వేళల్లో సామూహిక లలితా పారాయణం చేశారు. తొమ్మిది రోజులూ అన్నదానం చేశారు. చివరిగా సోమవారం సాయంత్రం అమ్మవారి తిరువీధి ఉత్సవాన్ని నిర్వ హించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారిని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన గరగల నృత్యాలు, కోలాటాలు, చిరతలు, బిండెల నాట్యం, నవదుర్గల వేషాలు ఆకట్టుకున్నాయి.



ఊరేగింపులో ఆకట్టుకున్న ప్రత్యేక వేషాలు



నవదుర్గల వేషధారణలు



బిండెల నృత్యం

ఈ రోడ్డుపై ప్రయాణం నరకమే..



ఆకులపేట వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

చీపురుపల్లి: నియోజకవర్గ కేంద్రంతో పాటు మండలంలోని పలుగ్రామాల రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. చీపురుపల్లి నుంచి ఆకులపేట, వెదుళ్లవలస, కుమరాం, బిల్లలవలస మీదుగా మెరకముడిదాం వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గోతుల మయమయ్యింది. ఎక్కడికక్కడే గుంతలు, గోతులు తేలిన ఈ రోడ్డులో ప్రయాణం నరకయాతనగా మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాల్లో సైతం వెళ్లలేకపోతున్నామని ప్రయాణికులు అంటున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటుతున్నా ఒక్క గుంత కూడా పూడ్చిన పాపాన పోలేదని పలువురు ఆరోపిస్తున్నారు.



మెట్టకాలనీ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు, తదితరులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన గరివిడి ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన వి ద్యార్థులు తుమ్మగంటి అమృతవర్షిణి, గుసిని రేణుకను, అలాగే ఉత్తమ ప్రతిభకనబరిచిన దుక్క రమేష్‌ను సన్మానించారు. హెచ్ఎం లీలాకుమారి ఆధ్వ ర్యంలో పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి అతిథిగా హాజరైన జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు విద్యార్థులకు తన సొంత నిధుల నుంచి రూ.10 వేలు నగదు బహుమతిగా అందజేశారు. పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని అమృతవర్షిణికి రూ.5వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన రేణుకకు రూ.3వేలు, తృతీయ స్థానంలో నిలిచిన రమేష్‌కు రూ.2వేలు అందజేశారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఉన్నత భవిష్యత్ కోసం విద్యార్థులు పాఠశాల దశ నుంచే బాటలు వేసుకోవాలని అన్నారు. ప్రతీ విద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయా లని సూచించారు. క్రమశిక్షణతో కష్టపడి చదువుకునే వారికి ఉన్నత భవిష్యత్ ఉంటుందన్నారు. ఎంఈఓలు పి.రామారావు, డి.అప్పన్న, కొండ పాలెం మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్, నాయకుడు పి.కుమార్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఆర్థిక సహాయం



ఆశ్రమ నిర్వాహకుడు లక్ష్మణరావుకు నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: స్థానిక బాపూజీ వృద్ధాశ్రమానికి మెరకముడిదాం మండలం, గోపన్నవలస గ్రా మానికి చెందిన సత్తారు చంద్రశేఖర్, శ్రావణి దంపతులు తమ కుమార్తె పుట్టినరోజు సందర్భంగా రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు కోట్ల లక్ష్మణరావుకు సో మవారం నగదు అందజేశారు. ఆశ్రమ నిర్వహణకు దాతల సహకారం అవసరమని లక్ష్మణరావు అన్నారు.

18న పాడిరైతుల సదస్సు

వేపాడ: ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జామి మండల కేంద్రంలో ఈనెల 18న జిల్లాస్థాయి పాడిరైతుల సదస్సును నిర్వహించనున్నట్లు జిల్లా రైతుసంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్ తెలిపారు. కొండగంగుబూడిలో సోమవారం ఆయన పాడిరైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవ సాయరంగానికి అనుబంధంగా పాడిపరిశ్రమ ప్రధాన వృత్తిగా ఎదిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంకంటే పాడి పాడి పరిశ్రమే ఆదాయ వనరుగా మారిందన్నారు. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాల ఉత్పత్తులపై జీఎస్టీ విధించడంతో డెయిరీలకు తీవ్రనష్టం వాటిల్లుతోందని, ఈ ప్రభావం పాడి రైతులపై పడుతోందన్నారు.పశుదాణా ధరలు రోజురోజుకీ పెరగడం, పాలధర రైతులకు గిట్టుబాటు కాకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాల సేకరణలో డెయిరీలు చెల్లిస్తున్న ధరకు అదనంగా లీటర్‌పై ప్రభుత్వం కనీసం రూ.10 ఇవ్వాలని, పశువులకు ఉచిత బీమా సదుపాయం కల్పించాలని, 75 శాతం రాయితీపై దాణా, మందులు సరఫరా చేయాలని, డెయిరీలన్నింటినీ సహకార రంగంలోకి తీసుకురావాలని, పశువుల కొనుగోలుకు రుణం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు నిర్వహిస్తున్న ఈ సదస్సుకు అధిక సంఖ్యలో పాడిరైతులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్‌ను అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త కృష్ణమ్మ

కొత్తవలస: మండలంలోని గొల్లపేట గ్రామ ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త పీతల కృష్ణమ్మ సుమారు రూ.40 వేల విలువైన కంప్యూటర్‌ను వితరణ చేశారు. హెచ్ఎం వి.ప్రసాదరావుకు సోమవారం ఆ పాఠశాలలో కంప్యూ టర్‌ను అందజేశారు. దాత కృష్ణమ్మ మాట్లాడుతూ తమ కుమారులు ఇదే పాఠశాలలో చదువుకున్నారు, ఒకరు సాఫ్ట్‌వేర్ ఇంజి నీ ర్, ఇంకొకరు ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్‌గా ఉద్యోగాలు చేస్తున్నారని, పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయంగా వారు కంప్యూటర్ అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం

- మన ఆరోగ్యం మన చేతుల్లో...
- భోజనం ముందు, తర్వాత హ్యాండ్ వాష్ చేసుకోవాలి
- నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం



శృంగవరపుకోట:

ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు పెద్దలు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది. ఇది అక్షర సత్యమంటున్నారు వైద్య నిపుణులు. ఆరోగ్యసంరక్షణ మన చేతుల్లో ఉన్నప్పుడు, దాన్ని నిర్లక్ష్యం చేసి చేతులారా పాడుచేసుకుని, వైద్యుల చేతుల్లో పెట్టడం ఎందుకు..? వ్యక్తిగత పరిశుభ్రతతో ఎన్నో వ్యాధులు దరిచేరకుండా నివారించవచ్చు. చేతుల శుభ్రత పాటించడం ద్వారా శరీరంలోకి క్రిములు, బ్యాక్టీరియా చేరకుండా నివారించుకోవచ్చు. మనం తాకే వస్తువుల్లో అనేక రకాల సూక్ష్మక్రిములు ఉంటాయని, చేతులు శుభ్రంగా ఉంచుకోకుంటే ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చేతుల శుభ్రత ఆవశ్యకతను తెలియజేస్తూ 2008లో ఐక్యరాజ్య సమితి అక్టోబర్ 15న వరల్డ్ హ్యాండ్ వాష్ డేగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఏటా అక్టోబర్ 15న చేతుల శుభ్రతపై విద్యార్థులు, ప్రజలకు వైద్యసిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

వ్యాధులు సోకే ప్రమాదం..

రోజూ చేతులు మారే కరెన్సీతో పాటు ఎక్కడపడితే అక్కడ చేతులు పెట్టడం ద్వారా చేతులకు వ్యాధి కారక క్రిములు అంటుకుని, భోజనం చేసేటప్పుడు, తినుబండారాలు తీసుకున్నప్పుడు అవి శరీరంలోకి ప్రవేశించి వ్యాధులకు కారణమవుతున్నాయి. రోగాలున్న వారి నుంచి రోగకారక క్రిములు గాలి, తుంపర్ల ద్వారా మన మన శరీరంలోకి వెళ్లే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంటి తలుపులు, ఫ్రిజ్ డోర్లు, కుళాయిలు తిప్పడం, ద్విచక్ర వాహనాల హ్యాండిల్ వినియోగంలోనూ అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రత పాటించని పక్షంలో తెలియకుండానే రోగాలపాలయ్యే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

చేతులు శుభ్రపర్చుకోకుంటే ..

ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం ప్రకారం సబ్బుతో చేతులు శుభ్రపర్చుకోకుంటే టైఫాయిడ్, పచ్చ కామెర్లు, కళ్లకలకలు, దగ్గు, జలుబు, న్యూమోనియా, మెదడువాపు, చర్మవ్యాధులు వంటివి సోకుతాయి. పాఠశాలల్లో విద్యార్థుల చేతుల శుభ్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలి. వారు వినియోగించే సాక్సులు రోజూ ఉతకడం, నీటిసీసాలు శుభ్రం చేయడం వంటివి చేయకపోతే ఫంగస్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. పిల్లల నోట్లో వేళ్లు పెట్టుకోకుండా చూడాలి. ఆటలు ఆడి వచ్చిన తర్వాత శుభ్రంగా చేతులు కడుక్కునేలా చర్యలు తీసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

- ఆహారం తీసుకునే ప్రతీసారి రెండు చేతులను కనీసం రెండుసార్లు సాధారణ సబ్బుతో శుభ్రం చేసుకోవాలి
- సబ్బు అందుబాటులో లేకుంటే నీటితో బాగా కడగాలి
- కుళాయి ఉంటే ఫోర్స్‌గా తిప్పి చేతులు కడగాలి
- కాళ్లు కడగడం కూడా తప్పనిసరి
- ఆహారం తీసుకున్న తర్వాత చేతులు కడిగాక, ఉతికిన వస్త్రంతో తుడుచుకోవాలి
- గోళ్లలో మట్టి చేరకుండా జాగ్రత్తపడాలి, గోళ్లు పెరిగిపోతే కత్తిరించుకోవాలి
- వారానికి రెండుసార్లు తలస్నానం చేయాలి
- మలవిసర్జన తర్వాత తప్పనిసరిగా రెండు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి
- ఆహార పదార్థాలను ముట్టుకునే ముందు, తినే ముందు, పిల్లలకు ఆహారం తినిపించే ముందు, తినిపిస్తున్న సమయంలో చేతులతో ఇతర పనులు చేయకూడదు


మైదానం అనుకుంటే పొరపాటే...



ఈ పచ్చదనాన్ని చూసి ఈ మైదానం పచ్చని గడ్డితో ఎంత బాగుందో కదా అని అనుకుంటే పొరపాటే. ఎల్.కోట మండలంలోని గొల్జాం గ్రామానికి ఆనుకొని ఉన్న గెడ్డవాగు ఇది. గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు, నాచు పెరిగిపోవడంతో ప్రస్తుతం మైదానాన్ని తలపిస్తోంది. ఆ మార్గంలో ప్రయాణించే వారికి కనువిందు చేస్తోంది.

– లక్కవరపుకోట

మాజీ ఎంపీపీ మృతి



పి.రాజన్న (ఫైల్)

కొత్తవలస: మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు పొలమరశెట్టి రాజన్న (82) అనారోగ్యంతో మంగళపాలెం గ్రామంలోని తన స్వగృహంలో సోమ వారం మృతి చెందారు. ఈయన కొత్తవలస మండలపరిషత్ అధ్యక్షుడిగా టీడీపీ నుంచి రెండు పర్యాయాలు పనిచేశారు. జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ కర్మాగార కార్మిక సంఘం టీఎస్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారు. వృద్ధాప్యంతో అనారోగ్యానికి గురై కొద్ది రోజులుగా మంచానికే పరిమితయయ్యారు. ఈయన మృతిపై టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు పలువురు సంతాపం తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

దత్తిరాజేరు: అల్పపీడనం ప్రభావంతో రానున్న రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ గోవిందమ్మ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. వర్షాలు కురిస్తే వరి, ఇతర పంట పొలాల్లో నీరు ఎక్కువగా లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. అలాగే ఎరువులు వేయవద్దని, పురుగు మందులు పిచికారీ చేయవద్దని, వ్యవసాయ అధికారులు సలహాలను తీసుకోవాలని సూచించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com